# పైత్యపు కవిత్వం

శ్రీ కర్రా వెంకటరెడ్డి

లాయర్ విశ్వపతిగారు కొడుకు కుటుంబరావు విషయంలో ఎక్కువగా బెంగపెట్టుకుంటున్నారు. అతనితో పాటే భార్య కామేశ్వరమ్మ వారికి కొడుకు సంగతేమీ బోధపడటం లేదు. కుటుంబరావు బి. ఏ. పరీక్ష తప్పడమే కాకుండా అసలు మనిషే పూర్తిగా మారిపోయాడు పరీక్ష తప్పడం కూడా విచిత్రంగా జరిగింది అందరూ కుటుంబరావుకి క్లాసు వస్తుందనుకున్నారు తీరా ఫలితం చూస్తే ఒకపార్టు ఉండిపోయింది అందుకు విశ్వపతిగారేమీ విచారించలేదు. కొడుకు సుఖంగా ఉంటే అంతే చాలనుకున్నారు. కాని కొడుకులో కలుగుతున్న ఈ మార్పు మాత్రం ఆయనను ఎక్కువగా కలవరపెట్ట సాగింది.

స్నేహితుడు విశ్వనాధానికి కూడా కుటుంబరావు విషయమేమీ అంతు చిక్క లేదు. స్నేహితునిలో కలుగుతున్న మార్పుకి కారణం ఏమిటో తెలిసికోవాలని విశ్వనాధం విశ్వప్రయత్నం చేశాడు కాని ఫలితం శూన్యం ఎదుటి హృదయంలో ఏముందో అతి సులువుగా పసికట్టే విశ్వనాధం కుటుంబరావు మనసులోని మర్మాన్ని లేశమాత్రమైనా తెలిసికోలేకపోయాడు. ఎంతో ప్రయత్నంచేసి విసిగిపోయిన విశ్వనాధానికి కుటుంబరావు సాల్వుచెయ్యలేని ఒక ప్రోబ్లంలాగ కనిపించాడు. ఓటమివలన కలిగే కోపదుఃఖాల పరిణామ వికారంలో “వాడు ఎట్లా పోతే నాకేం? వాడి ఖర్మ ఎలా వుంటే అలా అవుతుంది” అనుకున్నాడు విశ్వనాధం.

కాని విశ్వపతీ, కామేశ్వరమ్మల విచారాన్ని చూడలేకపోయాడు విశ్వనాధం. ఒకనాడు విశ్వనాధాన్ని ప్రక్కకి పిలిచి కామేశ్వరమ్మ బ్రతిమాలుతూ “వాడు ఎందుకట్లా అయిపోతున్నాడో ఎలాగైనా తెలుసుకో బాబూ! ఎంత అడిగినా మాతో చెప్పడు ఈ చిన్న ఉపకారం చేశావా నిన్ను జన్మజన్మాలకూ మరువను” అంది. విశ్వనాధం చాల బాధపడ్డాడు. తన స్నేహితుని మంచిచెడ్డలు తనకి మాత్రం అక్కర లేదూ? ఆవిడ తనని అంతగా బతిమాలుకోవాలా? ఏ విధంగానైనాసరే ఈ కార్యం సాధిస్తానని ఆమెకు మాట యిచ్చాడు

కుటుంబరావుకి కూడా తనలోని మార్పు కొద్దికొద్దిగా అర్థమవుతోంది కాని దానికి కారణమేమిటో అతను ఊహించలేకపోతున్నాడు తనలో ఏదో మార్పు కలుగుతోందన్న భావం తప్పితే, అది ఎటువంటి మార్పో, ఏ విధంగా జరుగుతూందో తెలియటంలేదు తనలోని మార్పుయొక్క కొన్నికొన్ని భౌతిక చిహ్నాలు అతనికి కనిపిస్తున్నయ్ వాటిని చూసి ఆశ్చర్యపోయాడు కూడాను కాని వాటి నాధారంగా చేసుకొని ఆ మార్పుకి ఒక స్వరూపాన్ని కల్పించుకోలేకపోయాడు ఏ విధంగానూ ఒక నిశ్చయానికి రాలేక మనశ్శాంతికోసం అసలు తనలో మార్పు కలగలేదనే అనుకోసాగాడు. కుటుంబరావు తన తలిదండ్రులు పడుతున్న బాధను చూస్తూనే ఉన్నాడు. వారిని ఎట్లా ఓదార్చాలో, వారికి ఏమి సమాధానం చెప్పాలో అతనికి తోచింది కాదు తనకితానే సమాధానం చెప్పుకోలేనివాడు ఇతరులకు ఏ విధంగా సమాధానం చెప్పగలడు?

కార్యదీక్ష పూనిన విశ్వనాధం కుటుంబరావు ప్రతి కదలికనీ నిశితంగా పరీక్షించసాగాడు ఒక్కటే ఒక్క విషయం అతని దృష్టిని గాఢంగా ఆకర్షించింది. కుటుంబరావు క్రొత్తగా భావగీతాలు రాయడం ప్రారంభించాడు విశ్వనాధం వాటి నన్నిటినీ అతిశ్రద్ధతో చదివాడు అవి అతనికి ఏ విధంగానూ తోడ్పడలేకపోయినవి. వాని వలన కుటుంబరావుయొక్క హృదయ భావము ఏ మాత్రము తేటతెల్లము కాలేదు విశ్వనాధం మాత్రం ఈ భావగీతరచనే కుటుంబరావులోని ముఖ్యమైన మార్పుగా తన మనస్సులో “మార్కు” చేసుకున్నాడు.

విశ్వనాధం కుటుంబరావుని అడిగాడు “ఏమిటి నీ మనస్సులోని బాధ?” అని.

“బాధ అంటూ ఏమీ లేదు ఏవో కొన్ని రంగు, రూపు లేని ఆలోచనలు, భావనలు కలుగుతూ ఉంటాయి వాటిని నేనే గుర్తించలేనప్పుడు నీకెట్లా చెప్పేది? ఏదో సముద్రంలో మునిగిపోతున్నట్టు, గాలిలో ఎగిరిపోతున్నట్టు ఉంటుంది ఒకొక్కసారి మంచుగడ్డలో చలికి కిలబడ్డట్టు ఉంటుంది. ఆ చలినుండి తేరుకోకముందే నా చుట్టూ మంటలు మండుతాయి వాటి వేడికి నేను సొమ్మసిలిపోతాను. మధురమైన ఒక అవ్యక్త ఆనందం, వెనువెంటనే భయమూ, బాధతో కూడిన విచారం ఏమని చెప్పను? ఎట్లా చెప్పను విశ్వం?” అన్నాడు కుటుంబరావు కలలో పలవరిస్తున్నట్టుగా.

ఈ సమాధానంతో విశ్వనాధానికి తల తిరిగిపోయింది. కుటుంబరావుకి మతిపోతోందేమో అనుకున్నాడు కాని కుటుంబరావు భావగీతాల్ని చాలామంది మిత్రులు మెచ్చుకుంటున్నారు అప్పుడే కుటుంబరావు ఒక భావకవిగా చలామణీ అవుతున్నాడు అటువంటి భావకవిని, పిచ్చివాడని ఎట్లా అనుకోగలడు? బహుశా ఈ భావకవుల కందరికీ ఇలాంటి కోతిబుర్రలే ఉంటాయి కాబోలనుకున్నాడు విశ్వనాధం కుటుంబరావు మనస్తత్వం విశ్వనాధానికి సుతరామూ నచ్చలేదు

విశ్వనాధం తను చెయగలిగిన ప్రయత్నమంతా చేశాడు. కుటుంబరావుచేత భావకవిత్వరచన ఎలాగైనా మానిపించాలని చూశాడు లాభం లేకపోయింది పైగా కుటుంబరావు కుప్పలు కుప్పలుగా భావగీతాలు రాయసాగాడు ఈమధ్య అతనిలో క్రొత్తలక్షణాలు కూడా పొడసూపినవి. కుటుంబరావు “వేశ్యోద్ధరణసంఘము” అని ఒక సంఘాన్ని స్థాపించి, రసికతకూ, ఆనందానికీ ఆటపట్టయిన వేశ్యాసమాజము అధోగతిపాలై క్షీణిస్తోందని, వారిని ఏ విధంగానైనా పునరుద్ధరించి మానవ సంఘానికి అందము, ఆనందము చేకూర్చాలని స్టేజి ఎక్కి ఉపన్యాసాలివ్వసాగాడు ఈ ప్రవర్తన విశ్వపతిగారినీ, కామేశ్వరమ్మనూ, ఆఖరికి విశ్వనాధాన్ని కూడా గాభరా పరచింది. విశ్వపతిగారు కుటుంబ

రావుకి వివాహం చేసేయాలని చూశారు. కాని కుటుంబరావు తన కింకా వివాహావసరం కలుగలేదనీ, సంఘోద్ధరణ భారంతో సంసారభారం కూడా మోయలేననీ నిర్మొహమాటంగా చెప్పేశాడు. చేసేది లేక విశ్వపతిగారు పస్తాయించారు. కామేశ్వరమ్మ కుమిలి కుళ్ళిపోయింది.

విశ్వనాథానికి కొక సరికొత్త ఆలోచన తోచింది. డాక్టరు బ్రహ్మానందం గారిని కలుసుకుంటే ఏమైనా ప్రయోజన ముంటుందా అనుకున్నాడు. బ్రహ్మానందం గారిని విశ్వనాథానికి బాగా తెలుసు. ఆయన పేరున్న డాక్టరే కాకుండా పెద్ద సైకొలజిస్టుకూడాను. విశ్వనాథం వెంటనే వెళ్ళి బ్రహ్మానందం గారిని కలుసుకున్నాడు. రోగులందరు వెళ్ళిపోయాక తన గోడు వెళ్ళబోసుకున్నాడు. "నా కొక మిత్రుడున్నాడండి. అతను బి. ఏ. పరీక్ష మార్చిలో తప్పి సెప్టెంబరులో పూర్తిచేశాడు. కొద్ది కాలంనుండి అతనిలో ఒక గొప్ప మార్పు కలుగుతూ వస్తోంది. నేను ఎంతో ప్రయత్నం చేశాను కాని కారణం తెలుసుకోలేకపోయాను. అతను ఏదో మానసిక వేదనకు గురిఅవుతున్నాడని నా అభిప్రాయం. ఈమధ్యనే క్రొత్తగా భావగీతాలు కూడా రాయడం ప్రారంభించాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. చాలా ముక్తసరిగా మాట్లాడతాడు. ప్రతి చిన్న విషయానికి విసుగు, చిరాకు ప్రదర్శిస్తాడు. ఏ విషయం అతనికి చిరాకు కలిగిస్తుందో, ఏ విషయం సంతోషం కలిగిస్తుందో కూడా తెలియటంలేదు. కొత్తగా "దేశోద్ధరణ సంఘమ"ని ఒకటి స్థాపించి దానితో 'డవ పడుతున్నాడు. అతని విషయమై తని తలిదండ్రులు ఎక్కువగా బెంగ ెట్టుకుంటున్నారు. మీరు అతనిని ఏ ధంగానైనా దారిలోకి తీసుకరావాలి."

బ్రహ్మానందంగారు విషయాన్నంతా ద్ధగా విన్నారు. చిరునవ్వు నవ్వుతూ అతను ఎవరబ్బాయి?" అన్నారు.

"లాయర్ విశ్వపతిగా రబ్బాయి."

"ఓహో!" డాక్టరుగారు కళ్లు ఎగుర స్తూ "విశ్వపతి గారిని నేను బాగా ఎరుగు ను. రెండురోజులక్రితం అతనిని నేను లుసుకున్నాను. కాని ఈ విషయమై యన నాతో ఏమీ చెప్పలేదే" అన్నారు.

విశ్వనాథం మౌనంగా తలవంచుకొని రుకున్నాడు.

"సరే రేపు అతనిని తీసుకొనిరా" న్నారు బ్రహ్మానందం గారు.

* * *

"డాక్టరు బ్రహ్మానందం గారిని ఒకసారి



కలుసుకుందాం వస్తావా?" అన్నాడు విశ్వనాథం కుటుంబరావుతో.

"ఎందుకూ?" అన్నాడు కుటుంబరావు పుస్తకంమీదినుంచి దృష్టిమరల్చకుండానే.

"నీకు ఆకలి కొంచెం మందగించిందట. దొడ్డమ్మగారు డాక్టరికి చూపించమన్నారు" అన్నాడు విశ్వనాథం.

"చూడు విశ్వం! అవసరం లేకుండా అబద్ధాలాడ కూడదు. మీకు ఏదో అనుమానం ఉంది. అది తీరిపోతే సరి. పద" అన్నాడు బయల్దేరుతూ.

కుటుంబరావు డాక్టరువద్దకు రావటానికి ఇంత సులభంగా వప్పుకుంటాడనుకోలేదు విశ్వనాథం. అసలు వప్పుకోడేమోనని భయపడ్డాడు. కుటుంబరావు తనంతట తానే బయలుదేరేసరికి విశ్వనాథం సంతోషంతో బరువుగా నిట్టూర్చాడు.

"ఏమిటోయ్ నీలోని బాధ" బ్రహ్మానందంగారు కుటుంబరావుని అడిగారు.

"ఎంతోమంది నన్నీ ప్రశ్న అడిగారు. వారికి నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. వారికి చెప్పినా ప్రయోజనమేమీ ఉండదు. మీరు డాక్టర్లు కాబట్టి మీకు చెప్పవలసిన బాధ్యత నామీద ఉంది. కాగితం కలం ఇప్పిస్తే రాసి చూపిస్తాను" అన్నాడు కుటుంబరావు.

బ్రహ్మానందంగారు కొంచెం ఆశ్చర్యపోయారు. మారుమాటాడకుండా కలం, కాగితం అందించారు. కుటుంబరావు కలం, కాగితం తీసికొని వ్రాతకు ఉపక్రమించాడు. బ్రహ్మానందంగారు, విశ్వనాథం కుటుంబరావుని విచిత్రంగా పరీక్షిస్తున్నారు. కుటుంబరావు ఏమి పిచ్చిరాతలు రాస్తాడో అని విశ్వనాథం దిగులుగా ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి రాయడం ముగించి కుటుంబరావు కాగితాన్ని డాక్టరుగారికి అందించాడు. డాక్టరుగారు పైకి చదివారు.

అతిప్రశాంత నిశాసమయాన
ఏదో రాగాలాపన నాహృదిలో
అవ్యక్తమై
అవగతమై
సుమధురమై
బాధావహమై
అగాధమై
అనంతమై
కల్లోల సాగర తరంగ
వీచికలబోలి
వేసవి మండు టెండల
ఎడారిగాడ్పుబోలి
ప్రియురాలి మధురా
ధర హాసరేఖబోలి
కంటకావృతమై, కడు రమ్య
మై ఒప్పు గులాబిబోలి
దూరమై
భారమై
చలితమై
క్షణికమై
రమ్యమై
భవ్యమై
దీప్తమై
వ్యాప్తమై
ప్రేయసీ ప్రియుల ప్రథమ
చుంబనము వోలె
మధుర ప్రభాత మారుతీ
వహితకోయిల కూతవోలె

నల్లమబ్బుల తెలిఅంచు
మెరపువోలె
నవ వధూచరణ
కింకిణీ రవమువోలె
ఏదో ప్రణయకావ్యాలాపన
కదలి, మెదలెను
నాహృదయ గహ్వరమున.

"ధోరణి బ్రహ్మాండంగా ఉంది" డాక్టరు కౌగిలిం మడత పెడుతూ" ఈ ఆలాపనగురించి ఇంకా ఏమైనా చెప్పగలవా?" అన్నారు.

"అది ఆలాపనో, ఆవేదనో చెప్పలేను డాక్టర్" అన్నాడు కుటుంబరావు విచారంగా.

"నీకు వివాహమైందా ?"

కుటుంబరావుకి బదులు విశ్వనాథం జవాబు చెప్పాడు.

"అవలేదండి. చేస్తామంటే వాడే వద్దన్నాడు."

డాక్టరుగారు కళ్లు పెద్దవిచేసి కుటుంబరావు వేపు చూస్తూ ఉన్నారు. కొంతసేపు ఉండి "నువ్వు అందంగా ఉంటావుసుమా కుటుంబరావ్" అన్నారు.

కుటుంబరావు కొద్దిగా సిగ్గుపడ్డాడు. వెంటనే తమాయించుకొని "డాక్టరుగారి అభినందనకు నేను పాత్రుణ్ణికానేమోనని నా అనుమానం" అన్నాడు.

డాక్టరుగారు నవ్వేరు. "ఇంకా ఏమైనా రాశావా ?" అడిగారు

"అబ్బే! ఎక్కడండి! ఇంటి దగ్గరో పెద్దకట్ట పడిఉంది" విశ్వనాథం బదులు చెప్పేడు.

డాక్టరుగారు ఆలోచనగా "పైత్యం వలన కలిగిన ఆలాపన ఇది. నా దగ్గర ఈ ఆలాపనకి చాలా మంచిమందు ఉంది. బహుశా కొద్ది మోతాదులతోటే ఈ ఆలాపన కట్టిపోవచ్చు" అన్నారు.

విశ్వనాథం మొహంమీద సంతోష చిహ్నాలు గుంపులు కూసుతున్నయ్. కుటుంబరావు పెదవులమీద హాసపు మెరపు కనిపించి మాయమయింది.

డాక్టరుగారు కొన్ని క్షణాలు ఊరుకొని "లోపల మా అమ్మాయి ఉంది ఆమెకి భావగీతాలంటే చాలా ఇష్టం మిమ్మల్ని తప్పకుండా పరిచయం చేయాలి పదండి" అన్నాడు ఆయన లేస్తూ.

డాక్టరుగారు శకుంతలకు కుటుంబరావుని పరిచయం చేస్తూ "ఈయనో పెద్ద భావకవి లాయర్ విశ్వపతిగారబ్బాయి. ఇతను ఈయనస్నేహితుడు విశ్వనాథం. ఈవిడ మా అమ్మాయి శకుంతల" అన్నారు.

నమస్కార ప్రతినమస్కారాలైన తరువాత కాఫీసేవనము జరిగింది శకుంతలా, కుటుంబరావులు పరిచయమైన పదినిముషాల్లోనే జోస్తీ కలిపేశారు శకుంతల కూడా భావగీతాలు రాస్తుందని విశ్వనాథం డాక్టరుగారివలన తెలుసుకున్నాడు ఒక కోతిబుర్రకి మరొక కోతిబుర్రతోడైందనుకున్నాడు విశ్వనాథం.

కొంతసేపు మాట్లాడిన తరువాత "మందు ఇస్తారా" అన్నాడు విశ్వనాథం డాక్టరుగారితో.

"ఆ మందు మనిషిని బాగా నీరసపెట్టుంది. పది, పదిహేను రోజులు పోయాక మందు ప్రారంభిస్తాను. ఈ లోపున మీ స్నేహితుడు పుష్టిఅయిన ఆహారం తీసుకొని కొంచెం తయారు కావాలి" అన్నారు డాక్టరుగారు.

తరువాత విశ్వనాథం, కుటుంబరావు డాక్టరుగారివద్ద శెలవుతీసికొని యింటికి బయలుదేరారు తోవలో కుటుంబరావు ఎంకిపాట ఒకటి ఈలమీద ఆలాపించాడు.

* * *

రోజూ కుటుంబరావు డాక్టరుగారింటికి వెడుతున్నాడు. రెండుమూడు రోజులు విశ్వనాథంకూడ అతని వెంట వెళ్ళాడు. కాని వాళ్ళ కోతిబుర్రలు మాట్లాడుకొనే మాటలు విశ్వనాథానికి అర్థం కాకపోగా విసుగెత్తించేవి. క్రమంగా విశ్వనాథం డాక్టరుగారింటికి వెళ్ళడం మానేశాడు. కుటుంబరావొక్కడే వెడుతున్నాడు.

పదిహేనురోజులు గడచిపోయినవి ఆ రోజు ప్రొద్దున్నే విశ్వనాథం డాక్టరుగారింటికి వచ్చాడు.

"ఈ రోజు మందు ప్రారంభం చేస్తానన్నారు" డాక్టరుగారికి విశ్వనాథం జ్ఞాపకం చేశాడు

"ప్రారంభిద్దామనే అనుకొంటున్నాను" అన్నారు, డాక్టరుగారు మెల్లిగా "మందు ప్రారంభింపబోయే ముందు విశ్వపతిగారి నోమారు కలుసుకొని వద్దాం పద" అన్నారు

డాక్టరుగారు, విశ్వనాథం లాయర్ విశ్వపతిగారింటికి వచ్చారు విశ్వపతిగారు డాక్టరుగారిని మహానందంతో ఆహ్వానించారు కుశలప్రశ్నల తరువాత కుటుంబరావు సంగతి వచ్చింది. వారు చాలాసేపు ఆ విషయమై మాట్లాడుకున్నారు

కామేశ్వరమ్మ డాక్టరుగారికి కాఫీ అందించుతూ "అబ్బాయిని మీ చేతుల్లో పెట్టాము ఏమి చేసుకున్నా మీదే పూచీ" అంది.

"చాలా సంతోషం" అన్నాడు డాక్టరుగారు వేడివేడి కాఫీ చప్పరించుతూ.

* * *

మరొక నెలరోజులకే శకుంతలా కుటుంబరావుల వివాహం జరిగింది

తరువాత కుటుంబరావు ఎమ్ ఏ కూడా ప్యాసయి కాలేజీ లెక్చరర్ గా పనిచేస్తూ పాపల తండ్రి అయినాడు. ఇప్పుడు కుటుంబరావు వంటి ఖులాసా వ్యక్తి మరొకడు కానరాడు.

ఎందుచేతనో కాని కుటుంబరావు భావగీతాలు మాత్రం రాయడం మానేశాడు

★


## బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిష్టర్డు)
### తెల్ల మెంద్రుకలను పోగొట్టును
రంగులనుచూచి మోసపోవద్దు అది తాత్కాలికము. మా సువాసనగల "మన్మోహిని హేర్ అయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారై 60 సం॥ వయస్సువరకు వెంట్రుకలను నల్లగావుంచును ఇదిగాక మెదడుకు చలవనిచ్చును "ఉన్మాదము, తలనొప్పి" వగైరా జబ్బులరానీయదు "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును కొద్దిగా నెరిసివుంటే ఒక సీసా రూ 2-8-0 3 సీసాలు రూ 9-0-0 సగము నెరిసివుంటే, ఒకసీసా రూ 5-0-0 3 సీసాలు రూ 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రూ 7/- 3 సీసాలు రూ 18/- ఇది పని చేయదని నిరూపించిన రూ 500/-

INDRA LABORATORIES,
P. O Raj Dhanwar (H. Bhag)



## నపుంసకతైలం
అంగ నరములు బలహీనతచెంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.
1 సీసా రూ. 10/ కల్డార్ల్ వి. పి. రూ 1-0-0.
ఆర్డరుతో రు 1/- పంపవలెను.
డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్
మలకపేట బిల్డింగ్స్,
హైద్రాబాద్, దక్కన్.